ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బదిలీ

కామారెడ్డి టౌన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్‌లు బదిలీ అయ్యారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఆర్‌ఎంవోగా డాక్టర్ డి. రవీందర్‌గౌడ్ బదిలీపై రానున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అందుకు సంబంధించిన మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ వికరాబాద్ జీజీహెచ్ ఆర్‌ఎంవోగా, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్ జేడీగా బదిలీపై వెళ్లనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన సాయి లక్ష్విత్

పాల్వంచ, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లాల అండర్-14 కరాటే బాలుర విభాగంలో పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ పాఠశాల విద్యార్థి సాయి లక్ష్విత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, పీఈటీ సునీల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో సైతం మంచి ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

అంబేద్కర్ విగ్రహ పునః ప్రతిష్ఠ పనులను పూర్తి చేయాలి

- అదనపు (రెవెన్యూ) కలెక్టర్ విక్టర్

నసురుల్లాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకోలు క్యాంప్ గ్రామంలో నేషనల్ హైవే -765డి రోడ్డు విస్తరణ పనుల ప్రభావం వల్ల తొలగించాల్సిన డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహం పునఃస్థాపన విషయమై మంగళవారం అదనపు కలెక్టర్ విక్టర్ గ్రామస్థులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో రోడ్డు విస్తరణ కారణంగా విగ్రహం తొలగించాల్సిన పరిస్థితులు వివరించి, గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించారు. గ్రామంలో విగ్రహం పునఃస్థాపనకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా గుర్తించామన్నారు. అధికారులు గ్రామ పెద్దలతో చర్చించి అంబేద్కర్ విగ్రహాన్ని గౌరవప్రదంగా కొత్త స్థలంలో ప్రతిష్ఠించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్పీ విఠల్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, తహసీల్దార్ సువర్ణ, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ వెంకటస్వామి, ఎస్సై రాఘవేంద్ర, గ్రామస్థులు రాము, మైసయ్య, ప్రశాంత్, రెడ్డి శీను, తదితరులు పాల్గొన్నారు.



యాసంగి ప్రణాళిక ఖరారు

- ప్రణాళికను సిద్ధం చేసిన జిల్లా వ్యవసాయశాఖ
- 4.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- అధిక మొత్తంలో వరి, శనగ, మొక్కజొన్న సాగు
- సిద్ధంగా ఉంచిన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు
- ప్రాజెక్టులు, చెరువుల్లో సమృద్ధిగా సాగు నీరు
- ఆయకట్టు కింద లక్షల ఎకరాల్లో సాగు

కామారెడ్డి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు వానాకాలం సీజన్ ముగిసింది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో యాసంగి పంటల సాగుపై రైతులు దృష్టి సారించనున్నారు. గత వానాకాలం సీజన్‌లో పుష్కలంగా వర్షాలు పడడంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు వచ్చి చేరింది. దీంతో జిల్లా రైతులు యాసంగి సీజన్‌పై మరింత ఆశలు పెట్టుకుంటున్నారు. యాసంగి సీజన్‌కు జిల్లా యంత్రాంగం సైతం ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లా పరిధిలో సుమారు 4.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో వరి, శనగ, మొక్కజొన్న పంటలు ఎక్కువ మొత్తంలో సాగయ్యే అవకాశం ఉంది. సబ్సిడీపై విత్తనాలను, ఎరువులను సైతం పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలా ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. యాసంగి సీజన్‌కు రైతులకు ప్రాజెక్టుల ద్వారా విడతల వారీగా సాగు నీటిని అందించేందుకు అటు రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతోంది. పంటల సాగు ప్రారంభం నుంచి కోతల వరకు సాగు నీటిని అందించాలని నీటి పారుదల శాఖ సిద్ధమవుతోంది. దీంతో సీజన్‌లో పంటలకు నీటి సమస్య ఉండదని విస్తారంగా పంటలను సాగు చేసుకునే అవకాశం ఉందని జిల్లా రైతుల్లో ఆశలు కలుగుతున్నాయి.

4.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 4,04,575 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వరి 2,46,500 ఎకరాలు, మొక్కజొన్న 34,420 ఎకరాలు, శనగ 38,500 ఎకరాలు, జొన్న 72,200 ఎకరాలు, పొద్దు తిరుగుడు 2,550 ఎకరాలు, గోధుమలు 720 ఎకరాలు, పెసర్లు 25 ఎకరాలు, మినుములు 2,550 ఎకరాలు, రాజుమ బీమ్స్ 3,200ల ఎకరాలు, తెల్ల కుసుమలు 880 ఎకరాలు, నల్ల కుసుమలు 1692 ఎకరాలు, నువ్వులు 1110 ఎకరాలు, ఇతర పంటలు 7 వేల ఎకరాలల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో జిల్లాలో అధిక మొత్తంలో వరి, మొక్కజొన్న, శనగ పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

యాసంగి సీజన్‌కు జిల్లా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించేందుకు పూర్తిస్థాయి నిల్వ ఉంచారు. ఎరువులు, విత్తనాల కొరత రాకుండా అధికారులు సిద్ధం చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు జిల్లాలో 39 వేల టన్నుల యూరియాను సరఫరా చేసేందుకు నిల్వలు ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులు 12 వేల టన్నుల్లో నిల్వలు ఉంచారు. డీఏపీ 10 వేల టన్నుల్లో, ఎంఓపీ 8వేల టన్నుల్లో అవసరమని అంచనా వేశారు. ప్రభుత్వపరంగా సబ్సిడీపై ఎరువులు అందజేయనుంది. ఈ సీజన్‌లో 78 వేల క్వింటాళ్లలో వరి విత్తనాలను, 3,750 క్వింటాళ్లలో జొన్న విత్తనాలను, 3,400ల క్వింటాళ్లలో మొక్కజొన్న విత్తనాలను, 14,400ల క్వింటాళ్లలో శనగ విత్తనాలను, 228 క్వింటాళ్లలో పొద్దు తిరుగుడు విత్తనాలను, 290 క్వింటాళ్లలో పెసర్లు, 280 క్వింటాళ్లలో మినుముల విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నామని వ్యవసాయశాఖ

(మిగతా 6లో..)


పీఎంపీలతో మాట్లాడుతున్న వైద్యుడు విఠల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీఎంపీలు ప్రాథమిక వైద్యం చేయాలి

జుక్కల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలో పీఎంపీలు వారి క్లీనిక్‌లకు వచ్చిన రోగులకు ప్రాథమిక వైద్యం చేయాలని జుక్కల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు విఠల్ పేర్కొన్నారు ఆదివారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్లో 'చిన్న రోగం పెద్ద బిల్లు' అనే వార్త కథనం ప్రచురించడంతో కామారెడ్డి వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జుక్కల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు విఠల్ జుక్కల్ పీఎంపీలతో మాట్లాడి విచారణ చేపట్టారు. జుక్కల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పీఎంపీలతో సమావేశం నిర్వహించి అనంతరం వారికి సూచనలు చేశారు. పీఎంపీలు చిన్నచిన్న గాయాలకు మాత్రమే వైద్యం చేయాలని ఆయన సూచించారు. పేషెంట్లకు పెద్ద జబ్బులు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆయన అన్నారు. పీఎంపీలు మెడికల్ ఏర్పాటు చేయవద్దని, అదేవిధంగా నిషేధించిన దగ్గు మందు పేషెంట్లకు రాయవద్దని ఆయన తెలిపారు. అనుభవం కంటే ఎక్కువ వైద్యం నిర్వహిస్తే పేషంట్ ఫిర్యాదు మేరకు పీఎంలపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.


గోపన్‌పల్లి చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కౌలాస్ నీటి విడుదలపై రైతుల ధర్నా

- సమాచారం ఇవ్వకుండా నీటి విడుదల చేయడంతో ట్రాక్టర్‌తో పాటు కొట్టుకుపోయిన ధాన్యం
- నష్టపరిహారం చెల్లించాలంటూ గోపన్‌పల్లిలో రైతుల ధర్నా
- రాత్రి వరకు కొనసాగిన రైతుల ఆందోళన

బిచ్కుంద, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో బిచ్కుంద మండలంలోని చిన్నదేవాడ వాగు ఒక్కసారిగా వరద పోటెత్తింది. దీంతో వాగు పరిసర ప్రాంతాల్లోని రైతుల వరి ధాన్యం వరద తాకిడికి కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం లేకుండా ప్రాజెక్టు నీటిని అధికారులు ఎలా విడుదల చేస్తారంటూ రైతులు మంగళవారం ధర్నాకు దిగారు. చిన్నదేవాడ వాగు పరిసర ప్రాంతాల్లో స్థానికంగా ఉండే రైతులు వందల ఎకరాల్లోనే వరి పంటను సాగు చేశారు. పంట చేతికి వచ్చింది. ధాన్యాన్ని పంట పొలాల్లోనే ఆరా బోశారు. అయితే గంగారం అనే రైతు వరిని కోసి ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వైపు తీసుకువస్తున్నాడు. ఇదేక్రమంలో ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో చిన్నదేవాడ వాగు ఒక్కసారిగా వరద ప్రవాహం (మిగతా 6లో..)


చిన్నదేవాడ వాగు వరదలో చిక్కుకున్న ధాన్యం ట్రాక్టర్

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పరీక్షలకు సిద్ధం చేయాలి

- నీట్, జేఈఈ, ఎంసెట్‌లలో తరగతులు నిర్వహించాలి
- 14లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేక్ సలాం


లింగంపేటలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న సలాం

లింగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేక్ సలామ్ అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జ్యోతిబాపులే గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. కళాశాలల్లోని అడ్మీషన్ రికార్డులను, హాజరు రిజిస్టర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లెక్చరర్లతో సమావేశం నిర్వహించి ఆయా సబ్జెక్టుల వారీగా సిలబస్‌ల వివరాలు అడిగారు. ఈ నెలాఖరు వరకు సిలబస్‌లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైన మెటీరియల్‌ను తయారు చేసి వారు ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రతిభ గల విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎంసెట్‌లలో ప్రత్యేక తరగతులు బోధించాలని వారికి మెడిసిన్ ఇంజనీరింగ్‌లలో సీట్లు వచ్చేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. ల్యాబ్‌లను పరిశీలించి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఈనెల 14లోపు పరీక్ష ఫీజులను ఆయా కళాశాలల్లో చెల్లించాలని ఆయన సూచించారు. బస్సులు సమయానికి రావడం లేదని నోడల్ అధికారి దృష్టికి తీసుకువెళ్లగా డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్, లెక్చరర్లు, విద్యార్థులు ఉన్నారు.

దక్కని మద్దతు ఆగని దోపిడీ

- దళారీ వ్యవస్థపై దృష్టిపెట్టని అధికారులు 5
- భారీగా నష్టపోతున్న రైతులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలి


4

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 65 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, నగదు అపహరణ

పత్తి కొనుగోలు చేయాలి


- ఇన్‌చార్జి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మద్నూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పత్తిని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కాకుండా చూడాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిన్నింగ్ మిల్లు యజమానులకు సూచించారు. మంగళవారం మద్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జిన్నింగు మిల్లు యజమానులతో సమావేశం నిర్వహించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విధించిన కొత్త నిబంధనల వల్ల జిన్నింగ్ మిల్లు యజమానులు పత్తి కొనుగోలుకు వెనుకడుగు వేయడంతో వారితో ఇన్‌చార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వపరంగా మీకున్న సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులను ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని సూచించారు. సీసీఐ విధించిన నిబంధనల మేరకు గతంలో మాదిరిగా కాకుండా ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో కొనుగోళ్ల బాధ్యతలను విడతల వారీగా చేపట్టాలని నిర్ణయించడంతో పత్తి జిన్నింగ్ మిల్లు యజమానులతో పత్తి కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ జిన్నిగుమిల్లు యజమానులతో మాట్లాడారు. సీసీఐ కొత్త నిబంధనల మేరకు నష్టపోతామని జిన్నింగ్ మిల్లు యజమానులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ప్రభుత్వపరంగా చర్చలు జరుగుతున్నాయని అప్పటి వరకు రైతులకు ఇబ్బందులు కలుగకుండా పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, అధికారులు జిన్నింగ్ మిల్లు యజమానులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో జిన్నింగ్ మిల్లు యజమానులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

పుల్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

బిచ్కుంద: మండలంలోని పుల్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఇన్‌చార్జీ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 670 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.


నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటి విడుదల

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి నిజాంసాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే ఈ ఏడాది వర్షాకాలం 307 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా ఆగస్టు 18 నుంచి నవంబరు 4 వరకు 69 రోజులుగా ప్రాజెక్టు గేట్లను నీటి పారుదలశాఖ అధికారులు ఎత్తి దిగువ మంజీరాకు 286.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 9,750 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా మంగళవారం వీఆర్ నెంబర్ 5లోని రెండు గేట్ల ద్వారా మంజీరాకు నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 104 సంవత్సరాలు పూర్తికాగా ఇప్పటి వరకు ఇంత భారీగా నీరు ఎప్పుడూ రాలేదని నీటిపారుదల శాఖ అధికారుల తెలిపారు. గత 69 రోజులుగా ప్రాజెక్టు నిండుకుండలా మారి పర్యాటకులను కనువిందు చేస్తోంది.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బాన్సువాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తా సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి నుంచి బాన్సువాడ వైపు వస్తున్న కారు, బాన్సువాడ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలోని గరుకుచెట్టుతండాకు చెందిన కేతావత్ వస్తురాం అక్కడికక్కడే మృతిచెందగా.. అతడి భార్య తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా ఆటో బోల్తా

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సబ్దల్‌పూర్ గేటు సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్‌లో బంధువుల అంత్యక్రియలకు హాజరుకావడానికి అదే గ్రామానికి చెందిన గంగాధర్ దంపతులు ఆటోలో వస్తున్నారు. ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి రహదారి పక్కన పొలంలోకి దూసుకెళ్లింది. అందులోని దంపతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

బీర్కూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం సమీపంలోని ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ద్విచక్రవాహనం, కారు ఢీకొన్నాయి. కిస్టాపూర్‌కు చెందిన సంజీవ్ బాన్సువాడ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సంజీవ్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సంజీవ్‌ను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

▸▸ 6.5 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, నగదు అపహరణ

కామారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని దేవునిపల్లి మెడికల్ కళాశాల సమీపంలోని వినాయకనగర్ కాలనీలో భారీ చోరీ జరిగింది. ఎస్సై భువనేశ్వర్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చంద్రమోహన్‌రెడ్డి 2రోజుల క్రితం బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లారు. చంద్రమోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తాళం పగలగొట్టి, మంచంపై వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో, లాకర్లలో ఉన్న 6.5 తులాల బంగారం, 2.5 కిలోల వెండి ఆభరణాలు, సుమారు రూ.2.5 లక్షల నగదు దుండగులు ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించడంతో దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవీపేటలో బ్లేడ్ ట్రాక్టర్..

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలం నీలాకు చెందిన అఫ్రోజ్ ఖాన్ బ్లేడ్ ట్రాక్టర్ చోరీకి గురైందని ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్‌ను గత నెల 18న నవీపేటలోని పెట్రోల్ బంక్ సమీపంలో నిలిపి ఉంచారు. అదే నెల 22న వచ్చి వచ్చి చూడగా ట్రాక్టర్ కనిపించలేదని, ట్రాక్టర్ గురించి ఎంత వెతికినా కనిపించకపోవడంతో అఫ్రోజ్ ఖాన్ మంగళవారం నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల కాయిల్స్, ఆయిల్..

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్ శివారులో గత నెల 29న దుండగులు 2 ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ కాయిల్స్‌తో ఆయిల్‌ను చోరీ చేశారని ఎస్సై తిరుపతి తెలిపారు. నవీపేటకు చెందిన రమణ వ్యవసాయ భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌తో పాటు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని వివరించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహితకు వేధింపులు.. ఇద్దరిపై కేసు

▸▸ డెంటిస్ట్, రియల్ ఎస్టేట్ వ్యాపారిపై సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు

నిజామాబాద్, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరానికి చెందిన ఓ వివాహితను వేధింపులకు గురిచేసిన ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తనను డెంటల్ డాక్టర్ కొండా అమర్, రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆయిల్ గంగాధర్ వేధిస్తున్నారని ఓ వివాహిత సోమవారం పోలీసు ప్రజావాణిలో సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని సీపీ 4వ టౌన్ పోలీసులను ఆదేశించారు. ఈ క్రమంలో వివాహిత మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి లిఖితపూర్వకంగా డాక్టర్‌తో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన కేశపురం మహేష్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో అదే గ్రామానికి చెందిన ఇద్దరికి జైలు శిక్ష పడిందని ఎస్సై తిరుపతి తెలిపారు. 2020లో జరిగిన భూ వివాదంలో మహేష్‌పై గడ్డపారతో దాడి చేసిన గంగోని నవీన్‌కు 5 ఏళ్లు, గంగోని హన్మాండ్లుకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సాయిసుధ తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

బాలుడిని తప్పించబోయి..
ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 04(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని తప్పించబోయిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మిని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన ఘటన మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్- వెల్లుట్ల గ్రామాల్లో పనిచేస్తున్న వరి కోత మిషన్ల యాజమాని అక్కడ పనులను పరిశీలించి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఆజామాబాద్ గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డుపై ఎదురుగా సైకిల్‌పై వస్తున్న బాలుడిని తప్పించబోయి.. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభానికి ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడింది. ఈ ఘటనలో ఎవరికి హాని జరగలేదని తెలిపారు.

డ్రైవరన్న.. జర జాగ్రత్త..!

▸▸ ప్రమాదకరంగా మూలమలుపులు ▸▸ తరచూ ప్రమాదాలు ▸▸ ఆందోళనలో ప్రజలు.. పట్టింపులేని అధికారులు

ఏర్గట్ల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏర్గట్ల, బట్టాపూర్, తడపాకల్ దారిలో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. క్షతగ్రాతులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోలేక ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా నష్టపోతున్నారు. మూలమలుపు వద్ద రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద కంపచెట్లు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


తీగలవాగు వద్ద ప్రమాదకర మూలమలుపు

ఎక్కడెక్కడంటే..

తాళ్లరాంపూర్-తడపాకల్ దారిలో రోడ్డు ఎత్తుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.

మండలకేంద్రంలోని మెట్‌పల్లి దారిలో 2 చోట్ల మూలమలుపులు వద్ద కంప చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారియి.

మండల కేంద్రం నుంచి బట్టాపూర్ వెళ్లే దారిలో మూలమలుపులు, కంప చెట్లతో నిండిపోయి, ప్రమాదాలు జరుగుతున్నాయి

మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి



మండలంలో చాలా రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కంపచెట్లు తొలగించాలి. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి. - ఇల్లెందుల నాగేంద్ర, తడపాకల్

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

మండలంలోని మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తాం. సూచిక ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- నామ్‌దేవ్,
ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి, ఏఈ, ఏర్గట్ల


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రాంపూర్ వీడీసీ సభ్యులు

నిధులు మంజూరు చేయాలి

ఆర్మూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంకాపూర్‌లో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని కలిసి రాంపూర్ చెరువు కట్ట మీదుగా మంథని రంగనాయకుల ఆలయం వరకు బీటీ రోడ్డు, మిర్ధాపల్లి, ఆలూర్ మీదుగా లింకు రోడ్డు, గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలన్నారు. రాంపూర్ మీదుగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మిగతా వాటికి కూడా త్వరలో మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రేషన్ దుకాణం తనిఖీ

ఆర్మూర్: అంకాపూర్‌లోని రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తనిఖీ చేశారు. బియ్యం వివరాలు, రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రతీఒక్కరికి సక్రమంగా సరుకులు అందజేయాలని, ప్రజలకు బియ్యం పంపిణీలో ఇబ్బందులు కలుగకుండా చూడాలని డీలర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.


శిక్షణ పొందిన మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న కమిషనర్ రాజు

శిక్షణతో జీవనోపాధి పొందాలి

ఆర్మూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు వివిధ కోర్సులలో నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని, జీవనోపాధి పొందాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మంగళవారం పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్ కోర్సులో శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. నర్సింగ్ శిక్షణ పొందిన మహిళలు చేసే వృత్తిలో ఓపిక, సేవాభావం కలిగి ఉండాలన్నారు. ప్రాంగణంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా ప్రారంభించిన శిక్షణ అభ్యర్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మహిళలు ఎంచుకున్న వృత్తికి న్యాయం చేయాలని, శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యంతో ప్రతీఒక్కరు ఆసుపత్రిలలో ఉద్యోగాలు సాధించాలని జిల్లా అధికారిణి ఇందిర పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంగణం అధికారులు, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.


నర్సరీని తనిఖీ చేసి సూచనలు ఇస్తున్న డీపీవో

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఆలూర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. ఆలూర్ గ్రామ పంచాయతీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు, అభివృద్ధి పనుల వివరాలు, శానిటేషన్ పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత, మురుగునీటి పారుదల వ్యవస్థ, చెత్త నిర్వహణ విధానంపై అధికారులను ఆరా తీశారు. అనంతరం ఆయన గ్రామ నర్సరీని సందర్శించి, మొక్కల సంరక్షణ, నీటి సదుపాయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం, కారోబార్ సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ పోశెట్టి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆవులకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి

పశువులకు టీకాలు వేయించాలి

జక్రాన్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వివేక్‌నగర్ తండాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆయన వేశారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నీరసించిపోతాయని పేర్కొన్నారు. వ్యాధి సోకిన వెంటనే గుర్తించి చికిత్స అందించకుంటే ఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ చికిత్స చేయించాలన్నారు లేకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశముందన్నారు. 114 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి అశ్రిత తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రవి, గోపాలమిత్ర రాజ్‌కుమార్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

శివాలయాలకు కార్తీక శోభ


శివాలయంలో సత్యనారాయణ వ్రతాల దృశ్యం

బోధన్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72 జంటలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంజీవ్ రెడ్డి దంపతులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వేద పండితులు గణేష్ మహరాజ్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్, వేద పండితులు గణేష్ శర్మ, శివ కుమార్, మహేష్, ఆలయ ఈవో రాములు పాల్గొన్నారు.

విఠలేశ్వరస్వామి పల్లకీ సేవ

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో మంగళవారం శ్రీ విఠలేశ్వర స్వామి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఠలేశ్వర స్వామి, రుక్మిణి దేవీ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగింపు చేపట్టారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా గుట్టపై ఆలయంలో జాతర నిర్వహించనున్నారు.


వాయిద్యాలతో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా భీమన్న గదల ఊరేగింపు

ఆర్మూర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్‌లో ఆదివాసీ నాయకపోడు ఆధ్వర్యంలో మంగళవారం భీమన్న దేవుని గదల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా నాయకపోడు సంఘ సభ్యులు డప్పు వాయిద్యాలతో, మహిళలు మంగళహారతులతో సంఘ సభ్యుల ఇళ్లలోకి గదలను తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం బాల్కొండ మండలం నాగాపూర్ శివారులోని గోదావరి నదిలో గదలకు జలాభిషేకం నిర్వహించారు.


ఊరేగింపులో పాల్గొన్న ఆదివాసీ నాయకపోడ్‌లు


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇళ్లు త్వరగా పూర్తిచేయాలి

డొంకేశ్వర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని డొంకేశ్వర్ ఎంపీడీవో లింగం లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని అన్నారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులకు కలిగిన సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ వివరాలను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, సిబ్బంది ఉన్నారు.


మధుకర్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

ఎంపీవోకు పదోన్నతి

బోధన్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): బోధన్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎంపీవో మధుకర్‌కు జిల్లా డీఆర్‌డీఏ ఏవోగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం పదోన్నతిపై వెళ్తున్న మధుకర్‌ను అధికారులు, నాయకులు, పంచాయతీ సెక్రటరీలు అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, బోధన్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎంపీవో మధుకర్‌కు జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏవోగా పదోన్నతి లభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీడీవో కిషోర్, డీఎల్‌పీవో నాగరాజులతో బోధన్, సాలూర మండలాల పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.


కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కోటగిరి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా పేర్కొన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల పాటలు, డ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కైసర్ పాషా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రమోద్, దత్తాత్రి, అనిల్, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

రెంజల్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ కళ్యాపూర్ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ధాన్యాన్ని ఎండబెట్టి, విక్రయానికి సిద్ధంగా ఉంచినా ఐకేపీ, సొసైటీ సిబ్బంది కాంటాలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పంట పూర్తిగా దెబ్బతింటే చేతికొచ్చిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయకపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేయగా.. తహసీల్దార్ వచ్చేంత వరకు రాస్తారోకో విరమించబోమని తేల్చిచెప్పారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అక్కడికి చేరుకుని ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.


కళ్యాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్ద పోచమ్మ, భూలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మారెడమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలలో విగ్రహాలు ప్రతిష్ఠిస్తామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు


శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలు


ఎమ్మెల్యేను కలిసిన ఉర్దూ ఘర్ కమిటీ చైర్మన్


సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

సుదర్శన్‌రెడ్డిని కలిసిన ఇందూరు ప్రతినిధులు

నవీపేట,నవంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మంగళవారం నవీపేట గౌడ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. మాజీ జడ్పీటీసీ సాయిబాబా గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామాగౌడ్, గంగాధర్ గౌడ్, సతీష్ గౌడ్ ఉన్నారు.

బోధన్: బోధన్‌లోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోధన్ ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ బ్యాటరీ బాబా, బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి ప్రతినిధి బసవేశ్వర్‌రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కిషోర్, మండలాధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ఉషోదయ విద్యాసంస్థ చైర్మన్ దుష్యాంత్, విద్యావికాస్ శ్రీనివాస్, సాయిప్రసన్న, జేపీ ఉన్నారు.

మోర్తాడ్, ఏర్గట్ల : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివనోల్ల శివకుమార్, కాంగ్రెస్ మోర్తాడ్, ఏర్గట్ల మండలాల అధ్యక్షులు ముత్యాల రాములు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ ఖేత్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, నాయకులు మునిమాణిక్యం, అజయ్ పాల్గొన్నారు.

బోనస్ చెల్లింపుపై కాంగ్రెస్ నాయకుల హర్షం

కోటగిరి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు బోనస్ చెల్లించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ హన్మంతు మాట్లాడుతూ.. ప్రస్తుతం అకాల వర్షాలతో రైతులు దిగుబడులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ ఇవ్వడంతో రైతులకు లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చాంద్ పాషా, పవన్, వీరేశం, సాయిలు, జుమ్మాఖాన్, రాజు, దత్తు, ధన్‌రాజ్,దిగంబర్ ఉన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆలూర్: ఆలూర్ మండలం కల్లడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకంచ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు నీలగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అని రైతులు పండించిన ధాన్యానికి ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రకటించడం రైతులకు ఊరట కలిగించే నిర్ణయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సారెడ్డి, నర్సింగ్, శివకృష్ణ, శ్రీను, యోహాను, భాస్కర్, సాయిరెడ్డి, బాలరాజు, సురేస్ గౌడ్, సాదు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ముప్కాల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి అండర్ 17 బాలబాలికల 69వ ఎస్‌టీఎఫ్ పోటీలను మంగళవారం నిర్వహించి, జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు పీడీ రాజ్‌కుమార్, విద్యాసాగర్ తెలిపారు. జిల్లా నుంచి 13 జోన్లు పాల్గొనగా రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేసిన విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. 13 జోన్‌ల నుంచి 30 టీంలు పాల్గొనగా అందులో నుంచి ప్రతిభ కనబర్చిన 12 మంది బాలబాలికలను ఎంపిక చేశామన్నారు. ఫైనల్‌లో బాలికల విభాగంలో ధర్పల్లి, డిచ్‌పల్లి తలపడగా డిచ్‌పల్లి, బాలుర విభాగంలో నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, వర్ని జట్లు తలపడగా వర్నిపై నిజామాబాద్ విజేతగా నిలిచిందన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి గంగాధర్, దాతలు నర్సయ్య, స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ అంజయ్య, ముస్కు మోహన్, కనకయ్య, హెచ్‌ఎం గంగారాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి


పెద్ద తడుగూర్‌లో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని ఎంపీడీవో రాణి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దతడుగూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం మంజూరైనా ఇళ్లు నిర్మించుకోని వారికి అవగాహన కల్పించారు. మండలానికి మొత్తం 897 ఇళ్లు మంజూరవగా, వాటిలో 487 ఇళ్ల నిర్మాణం ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. 343 బేసిమెంట్ లెవల్‌లో, 140 రూఫ్ లెవల్‌లో ఉన్నట్లు వెల్లడించారు. 65 ఇళ్లు ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీవో వెంకట నరసయ్య, ఏపీవో పద్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయకుంటే దీక్ష చేస్తా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఆయా

మద్నూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తప్పుడు దస్తావేజులతో ఉద్యోగ విరమణ ప్రకటించారని, గత 15 నెలలుగా విధులు నిర్వహిస్తున్నా వేతనాలు ఇవ్వడంలేదని అంగన్‌వాడీ ఆయా రాజాబాయ్ మద్నూర్ తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గోజేగావ్ అంగన్‌వాడీలో 1987 నుంచి ఆయాగా విధులు నిర్వహిస్తున్న తనకు పదేళ్ల ముందుగానే తప్పుడు దస్తావేజులతో అధికారులు ఉద్యోగ విరమణ ప్రకటించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అయినప్పటికీ తాను అంగన్‌వాడీకి వెళ్లి 15 నెలలుగా విధులు నిర్వహిస్తున్నానని, వేతనాలు మాత్రం ఇవ్వడం లేదంటూ వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నా న్యాయం జరగలేదన్నారు. వారం రోజుల్లో తనకు న్యాయం జరగకపోతే తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పర్యావరణ హిత బ్యాగ్‌ల పంపిణీ


పర్యావరణ హిత బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

బాన్సువాడటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల సురేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచితంగా పర్యావరణ హిత బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లబ్ధిదారులు ప్లాస్టిక్ బ్యాగులలో కాకుండా పర్యావరణ హిత బ్యాగులలో సరుకులు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దాసరి శ్రీనివాస్, నార్ల ఉదయ్, సిద్ది లక్ష్మీనారాయణ, నాగులగామ మణికంఠ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీ-శాట్, తెలంగాణ స్టేట్ జీహెచ్‌ఎంసీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహించారు. మండలస్థాయిలో నిర్వహించడంతో మండలంలోని బీర్కూర్, దామరంచ, బరంగేడ్గి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ప్రధానోపాధ్యాయులు మోహన్, క్యాకయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు గ్యాస్‌స్టవ్‌ల పంపిణీ


అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్‌స్టవ్ అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్‌స్టవ్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలకేంద్రంలోని లయన్స్ భవనంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ రైతు ప్రతాప్ నాయక్, శివనారాయణలను ఘనంగా సన్మానించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెలలో ఉచిత డయాబెటిక్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దు


రైతులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ వెంకట్‌రావు

పిట్లం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని జాతీయ రహదారిపై ఆరబెట్టరాదని ఎస్ఐ వెంకటరావు రైతులకు సూచించారు. మంగళవారం ఈ విషయమై అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో ప్రయాణికులకు ఇబ్బంది అవుతుందని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో రైతులు సహకరించాలన్నారు. జాతీయ రహదారి సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

దక్కని మద్దతు ఆగని దోపిడీ



- దళారీ వ్యవస్థపై దృష్టిపెట్టని అధికారులు
- భారీగా నష్టపోతున్న రైతులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్

సదాశివనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంటలకు మద్దతు ధరలు ప్రకటించడం, ఆ ధరలను బోర్డులపై చూస్తూ మురిసిపోవడం తప్ప అన్నదాతలకు ఒరిగిందేమి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2400, సోయాకు రూ.5400 మద్దతు ధరలు ప్రకటించింది. అయితే కొనుగోళ్లు వేగంగా చేయకపోవడంతో దళారులు ఇష్టం వచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కర్షకులకు నష్టాలు తప్పడం లేదు.

దళారులు చెప్పిందే రేటు

మొక్కజొన్న నాసిరకంగా ఉందంటూ రూ.1800ల నుంచి ప్రారంభిస్తూ ఇష్టం వచ్చిన ధర అడుగుతున్నారు. మరోవైపు సోయా పంట రూ.3800ల నుంచి ధర నిర్ణయిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. ఇక వరి ధాన్యం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్ల వెంబడి కొట్టుకుపోవడం, నల్లబారిపోవడం మిల్లర్లకు అదునుగా మారడంతో రైస్‌మిల్లులోకి వెళ్లిన ధాన్యాన్ని తూకంలో తగ్గుదల చేసినా చేసేదేమీ లేదని రైతులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వాలు తమ గొప్పల కోసం మద్దతు ధరలు అంటూ, చివరి గింజ వరకు కొంటామనే మాటలు తప్ప రైతుల పరిస్థితిపై అంచనా వేయడంలో పూర్తిగా విఫలమవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో అధికారుల మందే దళారులు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా కొనుగోలు చేస్తూ తూకాలలో మోసాలకు పాల్పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవట్లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దఎత్తున సోయా, మొక్కజొన్న సాగు

సదాశివనగర్ మండలంలో 7400కు పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న, సుమారు 8200 ఎకరాల్లో సోయా సాగు చేసినప్పటికీ ప్రభుత్వం కొనుగోళ్ల ఊసే ఎత్తకపోవడంతో దళారులు రెచ్చిపోయి అందినకాడికి దండుకుంటున్న పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలకు సోయా తడిసి నల్లబారడం, మొక్కజొన్న ఆరబోసి ఎండే వరకు వేచి చూద్దామంటే అకాల వర్షానికి కొట్టుకుపోవడం, మిగిలిన ధాన్యం మొలకెత్తడం జరుగుతుంది. కుప్పలు వేస్తే గింజలు నల్లబారిపోతున్నాయి.

జిల్లా అధికారులు దృష్టి సారించాలి

గ్రామాల్లోని దళాలరుల వ్యవస్థపై కలెక్టర్ స్థాయిలో దృష్టి సారించి కిందిస్థాయి అధికారులకు పలు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తే కొంతవరకైనా రైతులకు మేలు జరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కొనుగోళ్లు నిర్వహిస్తున్న వ్యాపారులు (ఫైల్)

7న ఉపాధిహామి ప్రజావేదిక

పెద్ద కొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో ఉపాధిహామి పథకానికి సంబంధించిన ప్రజావేదిక కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అభినవ్ చందర్ తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 01-04-2024 నుంచి 31-03-2025 వరకు జరిగిన పనులకు గాను ఆయా గ్రామాలలో అడిట్ సిబ్బంది అడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులతో పాటు, ప్రజలు హాజరుకావాలని సూచించారు.

గాలికుంటు నివారణ టీకాలు


గాలికుంటు టీకాలు వేస్తున్న సిబ్బంది

పెద్ద కొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద కొడప్‌గల్‌లో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఓఎస్ సురేష్ మాట్లాడుతూ.. శిబిరంలో 395 ఆవులకు, 289 గేదెలకు టీకాలు వేశామన్నారు. పశువుల పెంపకం దారులు తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం మండల కేంద్రంలో శిబిరం నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలలో టీకాలు వేస్తామని తెలిపారు. హాస్పిటల్ అటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

పెద్దకొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని మండల వైద్యాధికారి ఉమాకాంత్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు పరిమితికి మించి వైద్యం చేస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు నివేదిస్తానని తెలిపారు. తనిఖీల్లో భాగంగా కొన్ని సెంటర్లలో బెడ్లు వేసి వైద్యం చేయడంతో పాటు సెలైన్ బాటిల్స్ ఉపయోగిస్తున్నారన్నారు. అంతేకాకుండా ట్యాబెట్లు కూడా వినియోగించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రోగులకు వివిధ పరీక్షలు అవసరమంటూ చిటీలు రాస్తున్నారన్నారు. ఇలా పరిమితికి మించి వైద్యం చేస్తున్నారని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లానని వారి నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ అన్నయ్య, ప్రిసిల్లా, ఏఎన్ఎం శోభ, ఆశ కార్యకర్తలు భారతి పాల్గొన్నారు.



పీఎంపీతో మాట్లాడుతున్న వైద్యాధికారి

హరీష్ రావుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కామారెడ్డిటౌన్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును మంగళ వారం పరామర్శించారు. ఇటీవల హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం హరీష్ రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రానికి పూలువేసి నివాళులు అర్పించారు.


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

పెద్దకొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాఠశాల బస్సులతో పాటు ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక 161వ జాతీయ రహదారిపై వాహనాలు నడిపే సమయంలో రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ అరుణ్

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

పిట్లం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో జరగనున్న వీశీవ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా పరిధిలోని ఇండియన్ మిషన్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరగనున్నాయి. కాగా కామారెడ్డి జిల్లా జట్టు ఎంపిక కోసం పిట్లం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో 12 రోజులపాటు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మంగళవారం జరిగిన శిక్షణ శిబిర ముగింపు కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీడీ అతిఖుల్ల, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంఈవో దేవిసింగ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జట్టు శిక్షణకు అవసరమైన వసతులు కల్పించి సహకరించిన దాతలు కవిత, దశరథం, డాకూరి వెంకట్ రెడ్డి, ఇమ్రోజ్, రమణరావు, క్రీడా దుస్తులు అందించిన కోహూరి శివకుమార్ విజయ్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, ప్రియాంక, సంజీవ్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్ పేట్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్, రబ్బీ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సబాత్ కృష్ణ తెలిపారు. ఈ నెల 21, 22వతేదీలలో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి నెట్ బాల్ క్రీడల్లో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి విష్ణువర్ధన్, పదవ తరగతి విద్యార్థిని వెన్నెల, రబ్బీ క్రీడలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు కార్తీక్, వెన్నెల, అర్చన, మను శ్రీ, రుచితలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఎంపీడీవో లలిత కుమారి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రాం రెడ్డి విద్యార్థులను అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్లు


విద్యార్థులకు చెస్ బోర్డులు అందజేస్తున్న డీఈవో

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రామారెడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కామారెడ్డి డీఈవో రాజు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ఉన్నత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మండల స్థాయి క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుడాలని సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. క్విజ్‌లో కె.సృజన్, ఉపన్యాసంలో బి.మధులిక, వ్యాసరచన పోటీల్లో బి.సందీప్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంఈవో నిట్టూరి ఆనంద్‌రావు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఆనంద్, గోపాల్‌రెడ్డి, వేణు మాధవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను భారత విద్యార్థి మోర్చా నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో దహనం చేశారు. రాష్ట్ర కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యార్థులకు అందించాల్సిన బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అర్బాస్‌ఖాన్, పెరుమండ్ల బుల్లెట్, శ్యామ్, కార్తీక్, శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


ఆకాశ దీపోత్సవం కార్యక్రమంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సరస్వతీ ఆలయంలో ఆకాశ దీపోత్సవం

కామారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఇల్చిపూర్‌లోని సరస్వతీ దేవి ఆలయం వద్ద కార్తీక మాసంను పురస్కరించుకొని ఆకాశదీపోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు దత్తాద్రి శర్మ, విజయ్‌పండే, ఆలయ నిర్మాణ దాత విఠల్‌పటేల్, సిద్దగౌడ్, నారాయణరెడ్డి, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

బాన్సువాడ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీ- సాట్, టీఎస్ జీహెచ్‌ఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 13 మంది ఉన్నత పాఠశాలలకు చెందిన 78 మంది విద్యార్థుల పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోర్లం పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్, ఆయాపాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా పార్క్ వద్ద రెడ్ల నిరసన


రెడ్ల నిరసన దీక్షలో మాట్లాడుతున్న కరుణాకర్ రెడ్డి

కామారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మంగళవారం నిర్వహించిన రెడ్ల నిరసన దీక్షలో రెడ్డి ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల్లోని పేదలకు రాజ్యాంగబద్ధంగా వారికి రావాల్సిన వాటాను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా.. వారు ఇచ్చినటువంటి రెడ్డి కార్పొరేషన్ ఇప్పటి వరకు చట్టబద్ధంగా రూపం లేకపోవడం, కార్యవర్గాన్ని ఏర్పాటుచేయలేకపోవడం బాధకరమని అన్నారు. ఈడబ్ల్యూఎస్ కమిషన్ రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మధుసూధన్‌రెడ్డి, జిల్లా నాయకులు రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేయాలి

సదాశివనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేయాలని జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. మంగళవారం స్థానిక రైతువేదికలో నిరక్షరాస్యత అనే అంశంపై మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిగ్రామంలో మహిళా సంఘాల్లోని సభ్యులంతా నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేసి సంఘ సభ్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. చదువుకోవడం వలన సమాజంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెరుగుతుందని సూచించారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతానికి అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం ప్రసాద్, సమాఖ్య అధ్యక్షురాలు బాలంబాయి, సీసీలు ఆంజనేయులు, రాజు, అకౌంటెంట్ రమేష్, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌లో 90 మార్కులు సరికాదు



వినతిపత్రం అందజేస్తున్న అగ్రవర్ణ పేదల సమితి ప్రతినిధులు

భిక్కనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ విద్యార్థులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో క్వాలిఫై మార్కులు 90 పెట్టడం సరికాదని, ఈ విధానంతో అన్యాయం జరుగుతుందని అగ్రవర్ణ పేదల సమితి అధ్యక్షుడు పెంజర్ల మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెట్‌లో అగ్రవర్ణాల విద్యార్థులకు టెట్‌లో 90మార్కులు ఉండటంతో చాలామంది అగ్రవర్ణ పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కటాఫ్ మార్కులు తగ్గించి అన్నివర్గాల వారికి సమాన మార్కులు ఉండేలా కృషిచేయాలని కోరారు. ప్రతినిధులు బాల్‌కిషన్, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.51 వేల విలువైన పుస్తకాల అందజేత



రమేష్‌చౌదరిని అభినందిస్తున్న చైర్మన్

కామారెడ్డిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రంథాలయాలకు భిక్కనూరుకు చెందిన ధనలక్ష్మీ జ్యువెలర్స్ యాజమాని రమేష్ చౌదరి రూ.51 వేల విలువైన పుస్తకాలను అందజేసినట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి, బిచ్కుంద, తాడ్వాయి, భిక్కనూర్ గ్రంథాలయాలకు పుస్తకాలను అందిస్తామని తెలిపారు. పుస్తకదానం అనేది సమాజ అభివృద్ధికి ముఖ్యమైన దానం అని తెలిపారు. గ్రంథాలయ సిబ్బంది మౌనిక, కపిల్, శ్రీను పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఉపశమనం



భిక్కనూరులో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు నవీన్‌సాయి

భిక్కనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రం లోని భవితకేంద్రంలో మంగళవారం ఫిజియో థెరపి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నవీన్‌సాయి 9 మంది దివ్యాంగ విద్యార్థులకు చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వలన మానసిక ఉపశమనం కలుగుతుందని, వీరిని క్రమం తప్పకుండా శిబిరానికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి, వెంకటేశ్వర్, పాఠశాల ఇంచార్జి హెచ్ఎం భవాని, ఐఆర్పీ మహేందర్, సిబ్బంది సంపత్, సునిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్, నవంబరు 04 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఏడీ శ్రీనివాస్ తెలిపారు. 58 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. పశువైద్య శిబిరాలను పాడిరైతులంతా సద్వినియోగం చేసుకొని పశుసంపదను పెంచుకోవాలని సూచించారు. పశువైద్య శిబిరాలను ఈ నెల 18వ తేదీ వరకు ప్రతి గ్రామంలో నిర్వహించి గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రవికిరణ్, గోపాలమిత్రులు ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్, బాలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్

భిక్కనూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇప్పటికీ మార్కౌట్ చేయని లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ఇళ్లు మంజూరై మార్కౌట్ చేయని లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఐకేపీ తరఫున సైతం రుణాలు ఇవ్వనున్నామని చెప్పారు. వెంటనే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో లక్ష్మీ, ఆయాశాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. వ్యక్తిపై కేసు

భిక్కనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను అడ్డుకొని వారి విధులకు ఆటంకం కలిగించిన భిక్కనూరుకు చెందిన జ్ఞానప్రకాష్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఓ కేసు విషయంలో హిటాచి వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో ఇద్దరు కానిస్టేబుళ్ల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దుర్భాషలాడుతూ వీడియోలు తీశాడు. నిరాధార ఆరోపణలుచేస్తూ సోషల్ మీడియాలో వీడియో వైరల్‌చేయగా అతనిపై కేసు నమోదుచేశామన్నారు.

మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన

కామారెడ్డిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల నిరోధంపై మానసిక వైద్యాధికారి రమణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీనేజీ వయస్సులో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటయ్యే అవకాశం ఉందన్నారు. ఈ వయస్సులో వచ్చే అవరోధాలను జయిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల మానసిక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సంపత్, ప్రిన్సిపాల్ ఇర్ఫానా, సోషల్ వర్కర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో వర్షం.. కష్టమంతా వ్యర్థం

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాలు
- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

మహమ్మద్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షం రైతుల కష్టానికి పరీక్షగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దయింది. మంగళవారం ఉదయం వరకు ఎండగా ఉన్న వాతవరణం మధ్యాహ్నం ఒక్కసారిగా క్షణాల వ్యవధిలో మారిపోయి వర్షం కురిసింది. దీంతో రైతులు తడిసిన ధాన్యాన్ని కుప్పలు చేస్తూ ఆందోళన కు గురయ్యారు. వర్షం అకస్మాత్తుగా రావడంతో ధాన్యంపై టార్పాలిన్‌లు, కవర్లు కప్పడానికి కూడా సమయం లేకపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఎండక ఇప్పటికే ఆరబెట్టడంతో ఆలస్యమవుతుండగా ఈ అకాల వర్షాలు పెద్ద సమస్యగా మారుతున్నాయని చెబుతున్నారు. ఎండిన ధాన్యం తడిసిపోవడంతో, తడిసిన ధాన్యాన్ని పలుమార్లు ఆరబెట్టాల్సిన అవసరం వస్తుందని అంటున్నారు. దీంతో సమయం, ఖర్చు వృథా అవుతుందని వాపోతున్నారు. చాలామంది రైతులు అకాలవర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు రైతులను సరిగా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెడితినే కొంటామంటూ అనవసర నిబంధనలతో రైతులను కొనుగోలు కేంద్రంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారు లు, సిబ్బంది తీరుతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించా ల్సి వస్తుందని, ప్రభుత్వం నిబంధనలను అడ్డం పెట్టుకుని రైతులను నిండా ముంచుతుందని వాపోతు న్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కామారెడ్డి రూరల్, నవంబరు 04 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్న పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించినట్లు ఎంఈవో ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు పోటీలలో గెలుపు ఓటమిలను స్పూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ వ్యాసరచన కార్యక్రమంలో మండలంలోని 18 ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదట నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి వై. శృతి, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల కామారెడ్డి, రెండవ బహుమతి ఉపన్యాసంలో సాన బేగం జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల కామారెడ్డి, మూడవ బహుమతి క్విజ్ పోటీలో హర్షిత్ జడ్పీహెచ్ఎస్ అడ్లూర్ విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు.

తాడ్వాయి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ కనబరచి రాణించాలని తాడ్వాయి ఎంఈవో రామస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. విద్యార్థి జీవితంలో క్రమ శిక్షణ ప్రాధాన్యత, తల్లిదండ్రుల పాత్ర, మానవ జీవితంలో దయ, మానవత్వంలో ప్రాధాన్యత తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు సంగారెడ్డి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈవో



కామారెడ్డిలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కౌలాస్ నీటి విడుదలపై ధర్నా

(5వ పేజీ తరువాయి)

పెరిగింది. ధాన్యం ట్రాక్టర్ వాగులో చిక్కుకుపోయింది. వరద ఉధృతి పెరగడంతో ధాన్యం ట్రాక్టర్ కొట్టుకుపోగా స్థానిక గ్రామస్థులు, రైతులు తాళ్ల సహాయంతో డ్రైవర్ లక్ష్మాగౌండను గట్టుకు చేర్చారు. అదేవిధంగా మరికొందరు రైతులు వాగుకు అవతలి వైపుగా ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇలా సమాచారం ఇవ్వకుండా ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయడంతో ధాన్యం కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండే రైతులు పెద్ద ఎత్తున గోపన్‌పల్లి చౌరస్తాకు చేరుకుని ధర్నా నిర్వహించారు. నీటిని విడుదల చేయడంపై అధికారులపై మండిపడడమే కాకుండా నష్టపరిహారం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తు చౌరస్తాలో రైతులు భైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ భరత్ అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. రిపోర్టు ఉన్నతాధికారులకు నివేదిస్తామని బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అవగాహన

రాజంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీసు కళాబృంద సభ్యులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మొబైల్ డ్రైవింగ్, మాదకద్రవ్యాల నివారణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు శేశరావు, సాయిలు, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మాచారెడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో విజయం సాధించిన జట్లకు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. అండర్-17 బాలబాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో మాచారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపి విజయం సాధించారని క్రీడల కీన్వనర్ వెంకటచారీ తెలిపారు. ఈ మేరకు వీరికి బహుమతులను అందజేసి అభినందించారు. సెక్రటరీ విజయలక్ష్మీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోదాంలను వినియోగించుకోవాలి



అడ్లూర్ ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న శ్యాంకుమార్

సదాశివనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందని సమయంలో ప్రభుత్వ గోదాంలను వినియోగించుకుని గిట్టుబాటు ధర దక్కిన సమయంలోనే విక్రయించుకోవాలని ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాంకుమార్ అన్నారు. మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేషన్ మేనేజ్‌మెంట్ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో వేర్ హౌసింగ్ డెవలప్మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ చట్టంపై అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘం చైర్మన్ సదాశివరెడ్డి అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదాంలలో ధాన్యాన్ని నిల్వ చేస్తే రైతులకు వేర్‌హౌజ్ రశీదు లభిస్తుందన్నారు. దాంతో రైతులు బ్యాంకుల నుండి రుణాలు పొందవచ్చునని అన్నారు. మార్కెట్ ధర పెరిగినప్పుడు ఆ ధాన్యాన్ని విక్రయించి రుణాలను సులభంగా చెల్లించుకోవచ్చని తెలిపారు. ఈ విధానంతో రైతులు తమ ఉత్పత్తులకు ఉత్తమ ధర పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ లక్ష్మణ్, సీఈవో భైరయ్య, డైరెక్టర్లు భాస్కర్, రాములు, ప్రవీణ్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన చైర్మన్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని శివనగర్, అడవిలింగాల గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వేగుల నర్సింలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో తూకానికి సిద్ధంగా ఉంచిన వరి ధాన్యం తడిసి మొలకెత్తడం జరిగిందన్నారు. ఆరుగాలం కష్టపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన అన్నదాతలకు నష్టం కలగకుండా ప్రభుత్వం చొరవతీసుకుని బాయిల్డ్ రైస్ మిల్లులకు అలాట్మెంట్ ఇచ్చి ధాన్యం పంపించాలని రైతుల తరఫున డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి ప్రణాళిక ఖరారు

(5వ పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు.

పుష్కలంగా సాగు నీరు

ప్రస్తుతం జిల్లాలో వానాకాలం సాగు అయిన పంటల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. వరి, పత్తి, సోయా, మొక్కజొన్నలను కొనుగోలు చేపడుతున్నారు. దాదాపు నెల రోజుల్లో కోతలు పూర్తి కావడమే కాకుండా కొనుగోలు చివరి దశకు చేరనుంది. ఆరుతడి పంటలు ముందుగా సాగు చేసి అ తర్వాత వరి వైపు మల్లనున్నారు. ఈ లోగ రైతులకు కావాల్సిన వరి విత్తనాలను, ఎరువులను వ్యవసాయ శాఖ జిల్లాకు తెప్పించనుంది. వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు ఇప్పటి వరకు అలుగులు పోస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడం జిల్లాకు సాగు నీటిని అందించే ప్రాజెక్టులు అయిన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ఆయకట్టుకు ఖచ్చితంగా నీటిని విడుదల చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగం వరి సాగు వైపే మొగ్గు చూపనుంది.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో..

జిల్లాలో యాసంగి పంటల సాగు ప్రణాళికను ఇప్పటికే రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అయ్యే అవకాశం ఉంది. నీటి వనరులు, బోరు బావులతో పాటు మూడు ప్రాజెక్టులకు ఆయకట్టుకు నీళ్లు అందుతాయి. జిల్లాలో వరి సాగుపై రైతులు మొగ్గు చూపునున్నారు. ఈ యాసంగిలో వరి ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచుతున్నాం.

- మోహన్‌రెడ్డి, డీఏవో, కామారెడ్డి

నేడే సిద్దుల గుట్ట జాతర

తాడ్వాయి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటా కార్తీకపౌర్ణమి రోజున నిర్వహించే బ్రహ్మాజీవాడి గ్రామ శివారులోని సిద్దులగుట్ట జాతరకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. భక్తులకు బస్సు సౌకర్యాలు కల్పించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి — డ్యూడ్
వెంకటేశ్వర — కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD
I.A.NO. 149 OF 2025
IN
ARB NO. No. 76 OF 2025

Between:
Shubha Darshini Chits Pvt. Ltd. Bodhan-Br., Nizamabad Dist. Rep. By Its Foreman K.Shiva Prasad ...Disputant
AND
Hanmanthu Golla and Others ...Opponents

NOTICE

To
OPP: 3 Sanjeev Kumar Annam, S/o. Kishtaiah, age 39 years, Occ.School Assistant, Govt. High School, Banswada, Banswada Mandal, Kamareddy District. R/o.H.No.2-124/10, Opp.Busstand, Barangedgi Village, Birkur Mandal, Kamareddy District.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money. Summons were issued to you. But you have failed to receive the same. The above dispute is posted on 12-11-2025 for your appearance. On that day you have to appear in person at 11:00 AM before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NIZAMABAD.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత

భిక్కనూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులకు మంగళవారం కామారెడ్డి డిగ్రీ కళాశాల లెక్చరర్ కిష్టయ్య ఐడీ కార్డులను అందజేసినట్లు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు సంధ్య, సీఆర్పీ మహేందర్ పాల్గొన్నారు.

ప్రచారంలో బాన్సువాడ నాయకులు

బాన్సువాడ: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా బాన్సువాడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం షేక్‌పేట్ డివిజన్‌లో స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ భాస్కర్, ఎస్టీ జిల్లా కోఆర్డినేటర్ అంబర్‌సింగ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భానుగౌడ్, వెంకట్‌రెడ్డి, రఫీక్, రహీం, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రెడ్డి, సాయిలు, పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్: మండల పరిధిలోని జంగమయ్యపల్లిలో మంగళవారం ఎల్లారెడ్డి ఎంపీడీవో తాహెరాబేగం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశా లను తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఏఎంసీ చైర్మన్ రజిత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

తాడ్వాయి: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేస్తామని తాడ్వాయి ఎస్సై నరేష్ హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. నందివాడకు చెందిన రవి, గుండారం గ్రామానికి చెందిన బన్నీకి కామారెడ్డి జిల్లా మెజిస్ట్రేట్ 2 రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు తెలిపారు.

జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

లింగంపేట: మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో శౌకత్ అలీ తెలిపారు. టీ-సాట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ స్టూడెంట్ కాంపిటేషన్-2025 సంవత్సరానికి మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా లక్ష్మణ్ యాదవ్ ప్రథమ బహుమతి, వ్యాసరచనలో భానుశ్రీ భవానిపేట ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, ఉపన్యాసంలో లింగంపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి రింషా ప్రథమ బహుమతి గెలుచుకొని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం

కామారెడ్డి రూరల్: ఇస్రోజివాడి గ్రామంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకొని పంటలను సాగు చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు వీడియోకాన్ఫరెన్సు ద్వారా పత్తి, వేరుశనగ పంటలో సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఈవోలు దేవేంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక సమావేశం

రామారెడ్డి: మండల కేంద్రంలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసార పరీక్ష పత్రాల పంపిణీని ప్రారంభించారు. గతేడాది రామారెడ్డి మండలంలో సేకరించిన 3184 మట్టి నమూనాలకు సంబంధించిన భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. డీఏవో మోహన్ రెడ్డి, ఏడీఏ ఎల్లారెడ్డి సుధా మాధురి, ఏవో భానుశ్రీ, ఏఈవో రాకేష్ పాల్గొన్నారు.

మంత్రి పదవి రావాలని పూజలు

రామారెడ్డి: మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి రావాలని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండల అధ్యక్షులు మొగుళ్ళ ప్రవీణ్ గౌడ్ నేపథ్యంలో ఆలయ గర్భగుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రావుఫ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన

రాజంపేట: బస్వన్నపల్లిలో మంగళవారం ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఎంపీడీవో బాలకృష్ణ అవగాహన కల్పించారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ఏమైనా సమస్యలుంటే పంచాయతీ కార్యదర్శికి వివరించాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి అపర్ణ, నాయబ్ తహసీల్దార్ సంతోషి, ఏపీఎం రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

లింగంపల్లిలో మెగా హెల్త్‌క్యాంప్

లింగంపేట: మండలంలోని లింగంపల్లిలో మంగళవారం నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. 200 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోకుల్ సాయిరాం తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాగౌడ్, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ వాహబ్, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, కిరణ్, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.